వార్డుల్లో అభివృద్ధి పరుగులు

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 51వ వార్డులో రూ.2.47 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మద్దిపాలెం: విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దుతున్నట్లు మేయర్ గొలగాని హరివెంకటకుమారి తెలిపారు. 51వ వార్డు మాధవధార వాటర్ ట్యాంక్ సమీపంలో సీతన్న గార్డెన్స్, మాధవధార వుడా కాలనీ, కళింగనగర్, మహత్ కాలనీ ప్రాంతాల అభివృద్ధి పనులకు శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణతో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.2,47,75,000 వ్యయంతో ఈ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీవీఎంసీలోని ప్రతి వార్డులోనూ అభివృద్ధి జరుగుతోందన్నారు. విశాఖను ఒక అంతర్జాతీయ నగరంగా చూపించాలన్నదే సీఎం ఆకాంక్షని పేర్కొన్నారు. మౌలిక వసతుల విషయమై రోడ్లు, డ్రెయిన్లు, కాలువలు ఇలా ప్రతి పనికి కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. కొండవాలు ప్రాంతాలను కూడా అభివృద్ధి చేస్తూ వేగవంతంగా పనులు పూర్తి చేస్తున్నామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు.

రూ.10 కోట్లతో పనులు: కె.కె.రాజు

సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ రూ.2.47 కోట్ల నిధులతో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, మరమ్మతులు వంటి పనులు ప్రారంభించామని తెలిపారు. 51వ వార్డులో ఇప్పటికే సుమారు రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తి చేశామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి వార్డును అభివృద్ధి చేస్తున్నామన్నారు. రెయ్యి వెంకటరమణ మాట్లాడుతూ 12 ఏళ్లుగా సాధ్యం కాని అభివృద్ధిని వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో చేసి చూపిస్తున్నామని, టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈ భరణి, ఏఈ అర్చన, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్యామ్, పైడి ప్రతాప్, తిరుమలరావు, ప్రసూనారెడ్డి, షేక్ బాబ్జీ, శ్యామ్, వరలక్ష్మి, రత్నం, ధర్మవతి, రాణి, అప్పారావు, మోహనరావు, శ్రీను, వినోద్, గణేష్, భాను, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పార్టీ బలోపేతానికి అందరి కృషి


మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కోరారు. 54వ వార్డు కంచరపాలెం వివేకానంద వీధి పాత్రపిల్లి అచ్చిబాబు కల్యాణ మండంలో శనివారం నిర్వహించిన వార్డు ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. 2024 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు ఐక్యంగా శ్రమించాలని పిలుపునిచ్చారు. వార్డుకు సంబంధించిన ఓటరు లిస్ట్ వెరిఫికేషన్, సంక్షేమ పథకాల అమలు తీరు, అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ చల్లా రజిని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 18 మందికి జరిమానా

- ఇద్దరికి జైలుశిక్ష

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందికి 5వ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ ఫైన్ విధించారు. మొత్తం రూ.90 వేల జరిమానాతోపాటు ఇద్దరికి జైలుశిక్ష వేశారు. విజయనగరానికి చెందిన యజ్జపారపు మధుకు ఏడు రోజులు, ఆరిలోవ డ్రైవర్స్ కాలనీకి చెందిన గనిరెడ్డి కనకరాజుకు పది రోజుల పాటు జైలుశిక్ష విధించారు. రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు ఒక్కొక్కరికీ కోర్టు ఫైన్ విధించినట్లు ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

ఒకరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



గాయాలతో వేణు

సీతమ్మధార: పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. అతడి తలపై గాయపరిచి గెడ్డలోకి తోసేశారు. వివరాలిలా.. పోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ వెనుక రోడ్డులో శనివారం మధ్యాహ్నం నడుచుకుంటూ వస్తున్న వేణుపై గుర్తు తెలియని కొందరు వ్యక్తులు దాడి చేసి పక్కనే ఉన్న గెడ్డలో పడేశారు. గాయాలతో బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కానిస్టేబుల్‌కు సంఘటన గురించి తెలియజేశారు. కానిస్టేబుల్ వెంటనే 108కు కాల్ చేసి చికిత్స నిమిత్తం అతడిని కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వ్యక్తి అదృశ్యం

మద్దిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జ్ఞానాపురానికి చెందిన యాళ్ల గోవింద్ జూన్ 12న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంత వరకు రాలేదు. ఇతడికి మద్యం తాగు అలవాటు ఉంది. గతంలో కూడా ఇలానే ఇల్లు వదిలి వెళ్లి తిరిగి వచ్చేసే వాడు. ఈసారి ఇన్ని రోజులు గడిచినా ఇంటికి రాకపోవడంతో శనివారం గోవింద్ భార్య యాళ్ల రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అష్టలక్ష్మీ అమ్మవార్లకు స్వర్ణపుష్పార్చన



సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో అష్టపద్మ కుండాత్మక అష్టలక్ష్మీ మహాయాగం అంగరంగ వైభవంగా జరుగుతోంది. లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు మాచవోలు రమేష్‌శర్మ, రిత్వికుల వేద మంత్రాల మధ్యం శాస్త్రోక్తంగా అష్టలక్ష్మీ మహాయాగం, స్వర్ణపుష్ప అర్చన, అష్టలక్ష్మీ అమ్మవార్లకు విశేష అర్చన, దర్బారు సేవ జరిపించారు. అమ్మవార్లకు భక్తులు స్వర్ణపుష్పార్చన చేసి, యాగంలో పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కొలువుదీరిన సకల కళాకారుల సంఘ కార్యవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న కొత్త కార్యవర్గ సభ్యులు

సీతంపేట: విశాఖ సకల కళాకారుల సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో జరిగింది. సంఘం గౌరవాధ్యక్షుడిగా సినీ నిర్మాత కంచర్ల అచ్యుతరావు, అధ్యక్షురాలిగా సినీ కవి జాలాది కుమార్తె జాలాది విజయ, ప్రధాన కార్యదర్శిగా చెన్నా తిరుమలరావు, కార్యదర్శిగా కె.లోకేశ్వరరావు, కోశాధికారిగా మధుపాడ రమణి, ఉప అధ్యక్షుడిగా జె.ఎం.ఆర్ నెహ్రూ, ఉపాధ్యక్షులుగా ఎం.త్రినాథరావు, దండు నాగేశ్వరరావు, అరుణ్‌సాయి కుమార్, సహాయ కార్యదర్శులుగా మిమిక్రీ శ్రీనివాస్, కందర్ప రాధ, జి.జగదీష్, నిర్వాహక కార్యదర్శిగా కోరుకొండ రంగారావులతో పాటు మరో 13 మంది సలహాదారులు, ఈసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. గౌరవాధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. అధ్యక్షురాలు జాలాది విజయ మాట్లాడుతూ నగరంలోని కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన నృత్యాలు, ఏకపాత్రాభినయం, సినీ గీతాలు, మిమిక్రీ, డొనాల్డ్ డక్ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో నరవ ప్రకాశరావు, బొట్టా వేణు, దండు నాగేశ్వరరావు, కొరిటాల ప్రభాకర్, ఎం.వి. రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

15న స్వాతంత్య్ర సమరయోధుల వారసులకు సత్కారాలు

సీతమ్మధార: దేశ 76వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వందే విశ్వభారత్ వీర పురస్కార్ పేరిట స్వాతంత్య్ర సమరయోధుల వారసులను సత్కరించనున్నట్లు సంస్థ చైర్మన్ బలివాడ రమేష్, ఎండీ భీమరశెట్టి వాసుదేవ్ తెలిపారు. సీతమ్మధార ఏఎస్సార్ నగర్‌లోని కార్యాలయంలో శనివారం మీడియాతో వారు మాట్లాడారు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం 3 గంటల నుంచి ఆర్కే బీచ్ కాళీమాత టెంపుల్ ఎదురుగా ఈ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలకు చెందిన 120 మంది స్వాతంత్య్ర సమరయోధుల వారసులను వేదికపై సన్మానిస్తామన్నారు. 300 అడుగుల జాతీయ జెండాతో బీచ్ రోడ్డులో ఫ్లాగ్ మార్చ్ జరుగుతుందని, యువత, విద్యార్థులతోపాటు నగరానికి చెందిన ప్రముఖులు పాల్గొంటారని పేర్కొన్నారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో రచయిత్రి డాక్టర్ జలాది విజయ, సుశీల, కిశోర్, విజయరమణి, లంక రమ్య, రాధ పాల్గొన్నారు.

ఉద్యోగులే రైల్వేకు ఆస్తి


మిత్ర మోహన్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిపో ఆఫీసర్ ప్రవీణ్ భటి, సహోద్యోగులు

తాటిచెట్లపాలెం: రైల్వేలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందే రైల్వేకు విలువైన ఆస్తని సీనియర్ కోచింగ్ డిపో ఆఫీసర్ ప్రవీణ్ భటి అన్నారు. వాల్తేర్ డివిజన్, క్యారేజ్ అండ్ వేగన్ విభాగంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్‌గా సుదీర్ఘకాలం పాటు పనిచేసి అనారోగ్య కారణాల రీత్యా స్వచ్ఛంద పదవీ విరమణ పొందిన కె.మిత్ర మోహన్‌కుమార్‌ను తోటి అధికారులు, సహోద్యోగులు ఘనంగా సత్కరించారు. న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ప్రవీణ్‌భటి మాట్లాడుతూ మిత్ర మోహన్‌కుమార్ రైల్వేకు ఎంతో విలువైన సేవలందించారని, రెండు సార్లు జీఎం అవార్డును సైతం అందుకున్నారని ప్రశంసించారు. ఏ సమస్య వచ్చినా అటు కార్మికులతో.. ఇటు అధికారులతో ఎంతో చాకచక్యంగా వ్యవహరించే వారని, మంచి నేర్పు కలిగిన వారని తోటి సిబ్బంది ఆయన సేవలను కొనియాడారు. ఆయన శేషజీవితం సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్లు ఎన్‌వీ ప్రసన్నకుమార్, పి.పోలిరాజు, ఆచార్య, ఎన్ఎఫ్ఐఆర్, న్యూఢిల్లీ వర్కింగ్ మెంబర్ రామ్‌మనోహర్ పాత్రో, కార్మిక సంఘ నాయకులు ఎన్వీ రమణ, జె ఈశ్వరరావు, టి.అప్పారావు, వంశీ, కె.శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం రేపు

మద్దిపాలెం: ఈ నెల 14న అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చౌదరి అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళింగనగర్‌లోని అసోసియేషన్ కార్యాయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అపోలో ఆస్పత్రి వైద్యులు బీపీ, సుగర్, కీళ్ల నొప్పులు, హృద్రోగ, ఈసీజీ, బీఎంఐ, 2డీ ఈకో వంటి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. అసోసియేషన్ సభ్యులు, పెన్షనర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సేవ చేయడం మహాభాగ్యం


మహిళలకు కుట్టు మిషన్లు అందజేస్తున్న జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ అచ్యుతరామరాజు

తాటిచెట్లపాలెం: సామాన్యులకు నిస్వార్థంగా సేవలందించడం మహాభాగ్యమని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ జన శిక్షణ సంస్థాన్ చైర్మన్ సి.అచ్యుతరామరాజు పేర్కొన్నారు. తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్మృతి సదన్‌లో జగద్గురు పీఠం నిర్వహించిన మాస్టర్ ఈకే 98వ జయంతి వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. పేదలకు సేవ చేసేందుకు తన వంతు కృషి చేస్తున్న వరల్డ్ టీచర్ ట్రస్ట్‌ను అభినందించారు. జన శిక్షణ సంస్థాన్ సహకారంతో అవసరమైన పలు వృత్తి విద్యల్లో శిక్షణ ఇక్కడ ఇచ్చినట్లు తెలిపారు. మాస్టర్ ఈకే వేలాది మందికి మార్గదర్శకులయ్యారని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆయనను స్మరిస్తూ, ప్రశంసించారు. ఇంతవరకు 1,620 మంది మహిళలకు ఉచితంగా శిక్షణ ఇచ్చామని చెప్పారు. టైలరింగ్ కోర్సుల్లో శిక్షణ పూర్తిచేసిన సుమారు 22 మంది మహిళలకు ధ్రువపత్రాలను, కొందరికి కుట్టు మిషన్లను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. చార్టర్డ్ అకౌంటెంట్, లెబెనో ఎల్ఫ్ నిర్వాహకులు పి.రామకృష్ణ, బాలభాను విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్.శుభశ్రీ, హోమియో వైద్యులు డాక్టర్ అజ్జరపు సుబ్బలక్ష్మి, డాక్టర్ ఎ.కృష్ణప్రసన్న, దాట్ల రాధ, బి.ఉషారాణి పాల్గొన్నారు.

శ్రావణ మాసోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

మద్దిపాలెం: ఈ నెల 17 నుంచి బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహించనున్న శ్రావణ మాసోత్సవాల బ్రోచర్‌ను శనివారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. 53వ వార్డు మద్దిపాలెం రాణాప్రతాప్ నగర్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నెల రోజుల పాటు అమ్మవారి పూజలు ఘనంగా నిర్వహించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ ఏడీ, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం మాట్లాడుతూ నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రత్యేక కుంకుమ పూజలు, లక్ష్మీ హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, ధర్మకర్తలు ధర్మకర్తలు బెహర వెంకటరత్నం, మళ్ల ధనలత, బుద్ధల అనురాధ, సత్యవరపు సతీష్, ఎస్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, సానబోయిన సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

కులాల వారీగా జనగణన అవసరం


మాట్లాడుతున్న కట్టా మల్లేశ్వరరావు

సీతంపేట: దేశంలో కుల గణన జరగకపోవడం వల్ల బీసీ సామాజిక వర్గం చాలా నష్టపోతోందని, దేశంలో 54 శాతంగా ఉన్న బీసీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. 15 శాతంగా ఉన్న ఓసీలకు మాత్రం 10 శాతం ఈడబ్ల్యూస్ రిజర్వేషన్ కల్పించడం ప్రభుత్వాలకు బీసీలపై ఉన్న చిన్న చూపునకు నిదర్శనమని అభిప్రాయం వ్యక్తం చేశారు. బీసీ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీరవిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'జన గణనలో సమగ్ర కులగణన' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సభాధ్యక్షుడు కట్టా మల్లేశ్వరరావు మాట్లాడుతూ దేశంలో కులాల మధ్య ఏర్పడిన అసమానతలు రూపుమాపాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే సెన్సస్‌లో సమగ్ర కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏపీ కూడా బీహార్ తరహాలో కులగణన చేపట్టాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, చింతపల్లి రాంబాబు, పెబ్బిలి రవికుమార్, ఈమని చంద్రశేఖర్, ఖాన్, ప్రొఫెసర్ చింతపల్లి కనకారావు, డాక్టర్ జి.వినూత్న, డాక్టర్ సీతల్, బొంగు రాజారావు, కడలి సుబ్బారావు,శరగడం వెంకటలక్ష్మి, పలువురు బీసీ నాయకులు తమ అభిప్రాయాలు తెలియజేశారు.

క్రైస్తవుల శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీ చేస్తున్న జాన్‌వెస్లీ, డేవిడ్ రాజు, ప్రీచర్స్ ఫెలోషిప్ సభ్యులు

మురళీనగర్/కంచరపాలెం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులను క్రిస్టియన్ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనిపై వీరు విశాఖ చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ బిర్లా కూడలి నుంచి కప్పరాడ జంక్షన్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్‌వెస్లీ మాట్లాడుతూ మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీ టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేవతి డేవిడ్‌రాజు ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవ మహిళలపై జరిగిన దాడి అమానుషమని, దీనిపై ప్రతి మహిళ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. మణిపూర్‌లో మానవత్వాన్ని కాపాడాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులంతా దారి పొడవునా నినాదాలు చేశారు. కార్యక్రమంలో చర్చెస్ ఆఫ్ క్రైస్ట్ ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ మాణిక్యాలరావు, కార్యదర్శి శంకర్ డానియేలు, రామరాజు, నవీన్, విక్టర్ రాజు, పాస్టర్లు పాల్గొన్నారు.

స్థానికులకే ఎంపీ సీటు కేటాయించాలి

సీతంపేట: ఏ రాజకీయ పార్టీ అయినా స్థానికులకే ఎంపీ అభ్యర్థి సీటు కేటాయించాలని మాజీ వీసీ, యూపీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య కె.ఎస్.చలం సూచించారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం 'విశాఖపట్నం పార్లమెంట్ అభ్యర్థి ఎవరు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి ఇప్పటి వరకు 20 లక్షల కోట్ల విలువైన భూములు దోపిడీకి గురయ్యాయని, బయట నుంచి వచ్చిన ప్రజాప్రతినిధులే ఈ పని చేశారని ఆరోపించారు. 1991 నుంచి స్థానికేతరులే విశాఖ ఎంపీగా ఎన్నికవుతున్నారని తెలిపారు. లీడర్ సంపాదకుడు వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ స్థానిక నాయకులు లేక ఇక్కడి సమస్యలపై ఎవరిని సంప్రదించాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. ప్రజల మధ్య ఉండే నాయకుల అవసరముందని, లేదంటే భావితరాల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రొఫెసర్ అల్లు గౌరీశంకర్ మాట్లాడుతూ రెండు సామాజిక వర్గాలే రాజకీయంగా ప్రాతినిధ్యం వహిస్తున్నాయని, స్థానికేతరులు దోపిడీ చేసి అభివృద్ధి చెందుతున్నారే తప్ప.. ఇక్కడి ప్రజల గురించి ఆలోచించడం లేదన్నారు. సమావేశంలో నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య ముత్యాలనాయుడు, మాజీ జిల్లా జడ్జిలు పి.ముత్యాలనాయుడు, సబ్బవరపు సూర్యనారాయణ, ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు, అరసం కార్యదర్శి అప్పలరాజు, సామాజిక ఉద్యమకారుడు ఎస్.వి.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నగరంలో శబరిమల సమాచార కేంద్రం


వివరాలు వెల్లడిస్తున్న అయ్యప్ప దాస్

తాటిచెట్లపాలెం: ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు దక్షిణ భారతదేశంలోనే తొలి శబరిమల సమాచార కేంద్రాన్ని విశాఖ శంకరమఠంలో ఈ నెల 27న ప్రారంభిస్తోందని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచారసభ జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాస్ తెలిపారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని ఓ హోటల్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. తమ ప్రచారసభ సహకారంతో ఏర్పాటు చేస్తున్న ఈ కేంద్రాన్ని ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు అధ్యక్షుడు అనంతగోపన్, సభ్యులు జీవన్, సుందరేశన్ తదితరులు ప్రారంభిస్తారన్నారు. దేశంలో మొదటి సమాచార కేంద్రాన్ని ముంబైలో శంకరాలయం హరిహరపుత్ర భజన సమాజ అయ్యప్ప ఆలయంలో ప్రారంభించారన్నారు. ఈ సమాచార కేంద్రం వల్ల విశాఖతోపాటు పరిసర ప్రాంతాల జిల్లాల్లోని అయ్యప్ప భక్తులకు శబరిమలలో జరిగే వివిధ పూజలు, కైంకర్యాలు, సేవలు నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సమావేశంలో ప్రచారసభ జాతీయ ప్రధాన కార్యదర్శి వై.బాలాంజనేయులు, కోశాధికారి ఎల్.ఆర్.రాజు, రాష్ట్ర అధ్యక్షుడు బెల్లపు హరిప్రసాద్, కార్యదర్శి సిహెచ్.శంకరాచారి, కోశాధికారి ఎం.శివనాగేశ్వరరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, కార్యదర్శి నరహరి, కోశాధికారి రామచంద్రరావు, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పూర్ణ పుష్కల అయ్యప్ప ట్రస్ట్ అధ్యక్షుడు ఆదిమోహనరెడ్డి, చైర్మన్ టి.శ్రీనివాసరావు, కృష్ణయ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వం మనది


సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న కె.కె.రాజు

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిది ప్రజా సంక్షేమ ప్రభుత్వమని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 49వ వార్డు 1086285 సచివాలయం పరిధి ఎన్‌జీజీవోస్ కాలనీ–2లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేసి సీఎం వైఎస్ జగన్ చరిత్ర సృష్టించారన్నారు. నవరత్నాలు ద్వారా ఇంట్లో ప్రతి సభ్యుడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని చెప్పారు. మనందరం ఆయనకు అండగా నిలవాలని కోరారు. యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, భట్రాజులు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, చంద్రశేఖర్, ఢిల్లీ రావు, ఆర్.చిన్నారావు, శకుంతల, సబ్బవరపు శ్రీను, కె.మంగ, ఎస్.కనక, భవానిశంకర్, పల్లా చైతన్య, పావని, ఈశ్వరరావు, సీహెచ్ శ్రీను, మున్నా, బాబు, వినయ్, సీనియర్ నాయకులు కృష్ణారావు మాస్టర్, బి.గోవింద్, షేక్ బాబ్జి, వి.అప్పారావు, వెంకటేష్, అశోక్, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్వతీశం, ఉపాధ్యక్షుడు పి.బలరామస్వామి, కార్యదర్శి కె.రామచంద్ర రాజు, డైరెక్టర్లు ఎస్.సాంబశివ రావు, రాజారావు, గుప్తా, స్వరూప్, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు, ఆర్పీలు పాల్గొన్నారు.

వార్డు అభివృద్ధే ధ్యేయం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డులో పలు అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి శంకుస్థాపన చేశారు. నక్కవానిపాలెంలోని ఏఎంజీ హాస్పిటల్ రోడ్డులో రూ.10 లక్షలతో చేపట్టే కాలువలు, కల్వర్టు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంతోపాటు విశాఖ మహా నగరాన్ని ఎంతో అభివృద్ధి చేస్తూ ప్రతిపక్షాల నోరు మూయించారన్నారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామ్మూర్తి, సచివాలయం సెక్రటరీలు, వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శంగా వాకర్స్ పార్క్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్క్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి తెలిపారు. పార్కు ఆవరణలో శనివారం నిర్వహించిన క్లబ్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే సభ్యులు, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, 50వ వార్డు కార్పొరేటర్ వి.ప్రసాద్ సహకారంతో నూతన సౌకర్యాలు సమకూరాయని చెప్పారు. రానున్న కాలంలో పార్కు పచ్చదనం, సుందరీకరణ కోసం చర్యలు చేపట్టామని, అవి త్వరలో అమలు చేస్తామని వివరించారు. పలు నిర్ణయాలు తీసుకుని ఆయా కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులు తీర్మానించారు. క్లబ్ కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి కూర్మారావు పూర్వాధ్యక్షులు నిమ్మగడ్డ బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, సీహెచ్ కృష్ణమూర్తి, కె.ద్వారకానాథ్, ఉపాధ్యక్షుడు ఎ.రామకృష్ణ, జాలీ వాకర్ ఎస్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ పాల్గొన్నారు.

జాబ్ నోటిఫికేషన్లు విడుదల చేయాలి

సీతంపేట: ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ప్రకారం నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఏపీ నిరుద్యోగ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్దివేముల శ్రీనివాస్ కోరారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నాలుగేళ్లు గడచినా ఇప్పటికీ ఒక్క నోటిఫికేషన్ వెలువడ లేదన్నారు. డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుళ్లు, విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పోస్టులు వేల సంఖ్యలో ఖాళీగా ఉన్నాయని, వాటి భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి మా ఉద్యోగం–మా సంతకం నినాదంతో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. దీనిలో భాగంగా సంతకాల సేకరణ, మేధావులతో సదస్సులు నిర్వహిస్తామన్నారు. నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి హామీలిచ్చిన పార్టీకే తమ మద్దతు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలసముద్రం సూర్యం, విజయనగరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.గౌరీశంకర్, కె.శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పి.గిరిధర్, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బి.రమణ పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం పదిలం


నడక పోటీలో పాల్గొన్న మహిళలు

మురళీనగర్: ప్రతి రోజూ నడవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ అన్నారు. స్వాతంత్య్ర దిన వేడుకల్లో భాగంగా వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ఆవరణలో శనివారం స్థానికులకు నిర్వహించిన నడక పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వాకర్స్‌కు అనుకూలంగా పార్కులు తయారు చేశామని చెప్పారు. రోజూ కనీసం 40 నిమిషాలు వాకింగ్ చేయాలని, దాని వల్ల రోజంతా ఉత్సాహంగా ఉంటారన్నారు. నడక, వ్యాయామం, యోగా, ధ్యానం మనిషికి దివ్యౌషధంగా పనిచేస్తాయని వివరించారు. ఈ సందర్భంగా మహిళలు, పురుషులు, పిల్లలను వివిధ కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహించారు. 20 ఏళ్ల నుంచి 80 ఏళ్ల వయసు గల మహిళలు, పురుషులతోపాటు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చూపారు. పోటీల్లో విజేతలకు ఆగస్టు 15న స్వాతంత్య్ర దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నట్లు వరప్రసాద్ తెలిపారు. వాకర్స్ డిస్ట్రిక్ 101 గవర్నర్ ఉప్పలపాటి శుభ తదితరులు పాల్గొన్నారు.

దిగొచ్చిన టమాటా ధర

సీతమ్మధార: నగరంలోని రైతుబజార్లలో టమాటా ధర తగ్గింది. నెల రోజులుగా కిలో టమాటా బహిరంగ మార్కెట్లో రూ.120 నుంచి రూ.150 వరకు విక్రయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి ప్రజలు ఇబ్బందులు పడకూడదని రాయితీపై టమాటా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకున్నారు. సబ్సిడీపై రూ.50కు టమాటాలు విక్రయించారు. శుక్రవారం నాటికి ధర రూ.78 ఉండగా.. శనివారం సీతమ్మధార రైతుబజార్‌లో కిలో టమాటా రూ.60కు విక్రయించారు. ఒక్కరోజులో సుమారు రూ.18 తగ్గిందంతో వినియోదారులు రైతుబజార్‌కు పోటెత్తారు. సోమవారం నాటికి టమాటా మరింత తగ్గే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు.